

# అట్లతద్ది

—వి. ఎస్. ఎన్. మూర్తి

'అద్బాయొచ్చి వెళ్లాడన్న మాట' అనుకున్నాడు. టైము దాదాపు నాలుగు కావస్తాంది. ఆయన కుర్చీలో నుంచి లేచి పెరట్లోకి వెళ్ళి ముఖం కడుక్కున్నాడు. హాల్లోకి వచ్చేసరికి ఆయన భార్య టీ గ్లాసుతో సిద్ధంగా ఉంది. ఆయన మౌనంగా టీ తాగుతూ కిటికీలో నుంచి బయటికి చూడసాగాడు. టీ తాగిన కాసేపటికి ఆయనకి ఏదో హుషారు కలిగింది. అటు ఇటు చూసి ఎవరూ లేరని నిర్ధారణ చేసుకుని ఏదో కూనిరాగం మొదలుపెట్టాడు.

వీధి చివరనున్న పిల్లల స్కూలు వదిలి పెట్టారు. కోదండరామయ్య కిటికీ పక్కనుంచి పిల్లలు గుంపులు గుంపులుగా వెళుతున్నారు. ఇంతలో ఓ గుంపులో నుంచి ఓ కుర్రాడు "అట్లతద్దోయ్" అన్నాడు గట్టిగా. వెంటనే పిల్లలందరూ "ఆరట్లోయ్, ముద్ద పప్పోయ్, మూడ ట్లోయ్" అంటూ ఎవరికి ఇష్టం వచ్చినట్లు వాళ్ళ గొంతులు చించుకుంటూ అరుచుకుంటూ ఇళ్లకి పోసాగారు. ఆ దారంట వెళుతున్న ఓ పిల్ల పుస్తకాలు నేలమీద పడిపోయాయి. ఆ పిల్ల క్రిందికి వంగి పుస్తకాలు తీసుకుంటూంది. ఇంకో పిల్ల— "ఒసేయ్ సీతా, తెల్లవారగట్ల మా ఇంటి కొచ్చి నన్ను లేపు. ఇద్దరం ఉట్టి కెన్నముద్ద తినేసి చెమ్మచెక్క, ఒప్పులగుప్ప ఆడుకుందాం" అంది. పుస్తకాలు తీసుకుంటున్న పిల్ల "అలాగే" అంది.

కోదండరామయ్య ఆ పిల్లల్ని కిటికీ దగ్గరకు రమ్మని సైగ చేశాడు. వాళ్ళు వచ్చారు. అప్పుడాయన "పాపా, అట్లతద్ది రేపా" అన్నాడు. అందు కా పిల్ల నవ్వేసి, "అవును. మీకు తెలియదా! మాకు రేపు స్కూలుకూడా లేదు" అంది.

"అలాగా? నాకు తెలియదమ్మా" అన్నాడు కోదండరామయ్య. పిల్లలు వెళ్లిపోయారు. అట్లతద్ది అనేసరికి ఆయనకి ఎందుకో హుషారు కలిగింది. 'అందుకే నన్న మాట ఇంట్లోవాళ్ళు పప్పు నాన బోస్తున్నారు' అనుకున్నాడు. ఏదో అనుమానం వచ్చి బట్టలబుట్ట క్రింద తను దాచిన పొట్లం విప్పాడు. అందులో పల్లేరుకాయ లున్నాయి. వెంటనే పొట్లం కట్టేసి యథాస్థానంలో పెట్టేసి తన కుర్చీలో కూర్చున్నాడు.

ఆయన మెదడు దీర్ఘాలోచనలో పడింది. చిన్ననాడు ఆయనకి తోటి పిల్లలతో కలిసి ఆడుకునే అవకాశం అంతగా కలగలేదు. అప్పుడప్పుడు వెళ్లినా పిల్లలు చేరనిచ్చేవారు కాదు. ఆ వయస్సులో అల్లరి చెయ్యాలని ఆయనకి మహా కోరికగా ఉండేది. కాని, సవతితల్లి, తండ్రి గుర్తు రాగానే ఉత్సాహం ఎగిరిపోయి భయం కలిగేది. అట్లతద్దికి తోటివారంతా అందరి పెరడులలో పాదులు, పూలమొక్కలు పాడుచేసి ఇంటి గుమ్మాలలో పల్లేరుకాయలు పోసి, తెల్లవారగట్ల వాకిట ముగ్గులు వెయ్యటానికి వచ్చిన వారి తిట్లు తింటుంటే ఆయనకి సరదాగా ఉండేది! అట్లతద్ది సాయంత్రం పిల్లలందరు తామేమి పనులు చేశారో చెప్పుకొని నవ్వుకునేవారు. అన్ని పనుల్లో అరటిగెలలు కొట్టెయ్యటం, కొబ్బరి గెలలు కొట్టెయ్యటం పిల్లలు ఘనతగా భావించేవారు. ఆ పనులు చేసినవారికి ఆ బృందంలో ఘనత వచ్చేది. 'ఎప్పటికయినా నేనూ ఇటువంటి పనులు చెయ్యగలుగుతానా' అనుకునేవాడు కోదండరామయ్య.

ఇదుగో! నోటికంతా రక్షణ చేకూర్చే
టూత్ పేస్ట్ — నీమ్
నీమ్ టూత్ పేస్ట్ మీ పళ్ళను శుభ్రపరచడమేగాదు, నీమ్ టూత్ పేస్ట్‌లో ఆరోగ్యప్రదాయిని వేప (నీమ్)కు వుండే అద్భుత లక్షణాలన్నీ వున్నాయి. పళ్ళను గట్టిపరిచి చిగుళ్ళకు రక్షణచేకూర్చి, దుర్వాసనను నివారించి, మీ నోటిని సర్వదా స్వచ్ఛంగా వుంచుతుంది.




కలకత్తా కెమికల్ వారి ఉత్పత్తి

ఆయన కోరిక అలాగే ఉండిపోయింది. ఆ పనులు చెయ్యటానికి అవకాశం రాలేదు. కొంత కాలానికి ఆయన కా పనులు చేసే వయస్సు కూడా దాటిపోయింది.

కోదండరామయ్య మస్తిష్కంలో 'పోనీ, ఈ రాత్రికి ఆ పనులు చేస్తే' అన్న ఊహ వచ్చింది. ఆయనకి హుషారు వచ్చింది. 'అవును. చిన్నప్పటినుంచి భయస్థుడుగా, పిరికివాడుగా బ్రతికాను. కనీసం ఈవేళయినా ఈ సాహసం చెయ్యాలి' అనుకున్నాడు. 'ఏం చెయ్యాలి, ఎవరింట్లో చెయ్యాలి' అన్న ప్రశ్న ఆయన మస్తిష్కంలో ఉదయించింది. వరసగా వీథి చివరనుంచి ఇళ్లని లెక్క పెట్టుకుంటూ, ఎవరింట్లో ఏమేమి ఉన్నాయో గుర్తు తెచ్చుకో సాగాడు. కొబ్బరిచెట్లు జడ్జీగారింట్లో, అరటి చెట్లు ఆయన స్నేహితుడు ధనుంజయ రావుగారింట్లోను, మరొక ఇంట్లోను ఉన్నాయి.

జడ్జీగారి కొబ్బరిచెట్లతోపాటు వాళ్ల ఆల్సేషియన్‌కూడా గుర్తుకొచ్చి కొబ్బరిగెల కొట్టే ప్రయత్నం విరమించు కున్నాడు. మరొకరి ఇంట్లో ఉన్న అరటి గెలలు కొట్టడానికి గాజుపెంకులున్న గోడ దాటాలని గుర్తుకొచ్చి ఆ ప్రయత్నం కూడా విరమించుకున్నాడు. ఇక మిగిలినది ధనుంజయరావుగారింట్లో అరటిచెట్లు. 'ఏమైనా ధనుంజయరావింట్లో గెలే కొట్టెయ్యాలి' అనుకున్నాడు కోదండ రామయ్య. కాని, ఎత్తైన ఆ గోడ ఎలా ఎక్కటం అన్న ప్రశ్న ఆయన మెదడులో రేగింది.

'ఈ పని అంతా ప్లాను వేసుకుని ధైర్యంగా, జాగ్రత్తగా చెయ్యాలి. ఎవరి కేనా తెలిస్తే పరువు పోతుంది. పైగా, ధనుంజయరావు మిత్రుడు కూడాను' అనుకున్నా డాయన. కుర్చీలో నుంచి లేచి వీథి అరుగు మీదికి వచ్చాడు. ఎదురుగా ఉన్న గోడ చాలా ఎత్తుగా కనుపించింది. 'అసలు వీడు ఈ గోడ ఎందు కంత ఎత్తుగా కట్టించాడు' అని ధనుంజయరావు మీద విసుక్కున్నాడు. గోడ పక్కనున్న టెలిఫోను స్తంభం చూడగానే కోదండరామయ్యకి ఉపాయం తట్టింది. 'అవును, ఆ స్తంభం మీదుగా గోడ ఎక్కవచ్చు' అనుకున్నాడు.

గోడ అవతల పక్కన ఏముందో, అసలు ఆ అరటిగెల ఎంత ఎత్తున ఉందో, దానిని ఎలా అందుకోవాలో మొదలయిన విషయాలు పరిశీలించటానికి ఆయన ధనుంజయరావుగారింటికి బయలుదేరాడు. గేటు చప్పుడు వినగానే లోపలనుంచి ధనుంజయరావు వచ్చి గేటు తెరిచి కోదండరామయ్యని చూసి, "రావోయ్! ఏమిటీ మూడు రోజుల నుంచి అయిపు లేవు. పేపరు చూడటాని కయినా రావటం లేదు" అన్నాడు.

కోదండరామయ్య చిన్నగా నవ్వేసి, "అబ్బే, ఏం లేదోయ్. ఏదో ఇంట్లోనే నిద్ర పోతున్నాను. పైగా, ఈమధ్య మా ఇంటికికూడా పేపరు వస్తోంది" అన్నాడు.

"సరే రా! హాల్లో కూర్చుందాం" అన్నాడు ధనుంజయరావు.

లోపల కూర్చుంటే తను వచ్చిన పని కాదని కోదండరామయ్య— "అబ్బే, వద్దోయ్. ఈ పువ్వుల మొక్కల మధ్య కుర్చీలు వేసుకుని కూర్చుందాం" అన్నాడు. ధనుంజయరావు మారుమాట్లాడకుండా రెండు కుర్చీలు తెచ్చి పువ్వుల మొక్కల పక్కగా వేశాడు. ఇద్దరూ పిచ్చాపాటీ మాట్లాడుకోసాగారు. మాట్లాడుతున్నంత సేపు కోదండరామయ్య పరిసరాలు జాగ్రత్తగా పరిశీలించాడు. గోడ పక్కన కొత్తగా ఓ ఇటుకల గుట్ట ఉంది. 'ఇదీ మంచికే. అంత ఎత్తునుంచి దూక నవసరం లేదు' అనుకున్నా డాయన. అరటి చెట్టు బరువుకి వంగటం మూలంగా గెల ఎక్కువ ఎత్తున లేదు. చెట్టుకి ఓ వెదురుబొంగు బోటు పెట్టి ఉంది. 'కొంచెం పైకి ఎగిరితే గెల అందుతుంది. లేకపోతే వెదురుబొంగు తీసేసి అరటి చెట్టు క్రిందకు వడదోయచ్చు' అను కున్నాడు కోదండరామయ్య.

ధనుంజయరావు భార్య ఆయనని పిలవటంతో ఇద్దరి సంభాషణకి అంత రాయం కలిగింది. కోదండరామయ్య లేచి నిలబడి పరిసరాల్ని మరొకసారి జాగ్రత్తగా చూసి, "వస్తానోయ్. చీకటి పడు తూంది" అన్నాడు. "మంచిది" అన్నాడు ధనుంజయరావు. కోదండరామయ్య ఇంటికి వచ్చేసి తన కుర్చీలో యథా ప్రకారం కూర్చుని తను చేయబోయే సాహసకృత్యానికి తగిన పథకం ఆలోచించ సాగాడు. తను చేయబోయే పని తలుచు కొన్నకొద్దీ ఆయనలో హుషారు పెరగ సాగింది. ఆయన బొత్తిగా చిన్నపిల్లవాడిలా 'ఎప్పుడు చేస్తానా ఆ పని' అని ఆరాట పడసాగాడు.

గడియారం ఒక గంట కొట్టింది. ఆయన టైము చూశాడు. ఆరున్నర అయింది. 'ఇంకా ఎనిమిది గంటలు ఆగాలి. అర్ధరాత్రి రెండు మంచి టైము. మళ్లీ మూడయితే ఎవడయినా అల్లరి కుర్రాడు ధనుంజయరావు ఇంట్లోకి రావచ్చు' అనుకున్నా డాయన.

ఆ రాత్రి కోదండరామయ్యకి భోజనం సరిగ్గా సహించలేదు. కొద్దిగా తిని కంచం వద్దనుంచి లేచిపోయాడు. ఆయన మనస్సు తాను రాత్రి చేయబోయే సాహసకృత్యంలో పూర్తిగా లీనమై పోయింది. ఇంట్లో నిద్ర పోతే రాత్రి తలుపులు తీయాలని, ఇంట్లోవారికి నిద్రా భంగం అయ్యే అవకాశం ఉందని ఆయన తన మంచం, పరుపు హాలులోనుంచి తెచ్చుకుని వీథిఅరుగుమీద వేసుకున్నాడు. "వీథిలో చల్లగాలిలో నిద్ర పోవడం ఎందుకు? అసలే మీ ఆరోగ్యం అంతంత మాత్రం" అన్న భార్య మాటల్ని ఆయన లక్ష్య పెట్టలేదు.

* * *

మంచంమీద కూర్చుని కోదండ రామయ్య వీథివైపూ, వీథిలో పోయే వారివంకా, ధనుంజయరావు ఇంటి ప్రహరీగోడవంకా చూడసాగాడు.

"తాతయ్యా!" అన్న పిలుపు వినిపించి తల వెనకకు తిప్పాడు. మంచం వెనకగా శీను నిలబడి ఉన్నాడు.

"ఏమిట్రా, శీనూ" అన్నా డాయన.

"నన్నుకూడా నీతో పడుకోనియ్యి, తాతయ్యా. తెల్లవారగట్ల నేను నా స్నేహితుల దగ్గరికి వెళ్లాలి. అమ్మా, నాన్నమ్మా వద్దంటున్నారు. నాకు జలుబు చేస్తుందిట. నన్ను అరుగుమీద పడుకో నియ్యి, తాతయ్యా!" ప్రాధేయపడుతూ అడిగాడు శీను.

మనవడి ఉత్సాహం చంపెయ్యటానికి ఇష్టం లేకపోయినా, తను చేయబోయే సాహస కృత్యానికి వాడు ప్రతిబంధకం

చెట్టులూ గుట్టలూ ఫోటో— హెచ్. ఎమ్. సాంబమూర్తి (బెంగళూరు—1)



# సపట్ మలామ్



తామర, గజ్జి, చిడుప
పాదములమీద మరియు వేళ్ల మధ్య పగుళ్లను
పోగొట్టుటకు దివ్యమైనది.

SAPAT & CO., BOMBAY 2.

ఏజంటు: ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్,
బకింగ్‌హాంపేట, విజయవాడ-2.



## నారీమణి-సులభ కోమల రమణీయతను ఆశించితే-పురుషులవలె 'క్షౌరం' ఎందుకు?

ప్రతి వాళాకు రమణివలె మీరున్న మీ చర్మము పై
ఎన్‌ఫ్రెంచ్ హేర్ రిమూవర్‌ను రాసుకొని చూడండి.
పనికిరాని వెంట్రుకలు తుడిచి పెట్టుకు పోయాయిగదా,
మంద సుగంధిత ఎన్‌ఫ్రెంచ్ హేర్ రిమూవర్
వెంట్రుకల వేరంట దొచ్చుకు పోయి తన చమత్కార
చర్యను జరుపుతుంది. చర్మము తెగదు, తక్షణం
నాచుననే భీతి లేదు. వారముల తరబడి చర్మము
సునువుగా పట్టువలె కోమలంగా వుంటుంది.
క్షౌరం నీకు కాదు కుమారీ—నీ కోసం అనుకూ
... ఎన్‌ఫ్రెంచ్ హేర్ రిమూవరే.




# ఎన్ ఫ్రెంచ్ హేర్ రిమూవర్
## పట్టువలె మృదువైన చేతులు, కాళ్లు కోసం

ట్రేడ్ మార్కు నకు రిజిష్టర్డ్ యూనర్: జేఫ్రీ మేనర్స్ అండ్ కం. లి. AF-152 Tel


నాయకుడు రాక్షసుణ్ణి చంపి వాడి గుండెలమీద కాలు పెట్టి రాకుమారి వైపు చూసి ఠీవిగా నవ్వినట్లుగా నవ్వాడు. ఆపైన మెల్లిగా మీసాలు మెలి వేసుకున్నాడు.

కోదండరామయ్యకి తెలియని ఆనందం కలిగింది.

'హా! ఇన్నాళ్లకి నేనూ ఒక సాహస కార్యం చేశాను. పని ఎటువంటిదయినా సాహసం సాహసమే' అనుకున్నాడు. . . పల్లేరుకాయల పొట్లం విప్పి వాటిని గేటు మెట్ల దగ్గర చల్లాడు. తరవాత ఇటుకల గుట్ట ఎక్కి, గోడ ఎక్కాడు. టెలిఫోన్ స్తంభాన్ని పట్టుకుని మెల్లిగా క్రిందకు జారిపోయాడు. వడివడిగా నడిచి తన మంచంమీద పడుకుని కళ్లు మూసుకున్నాడు.

గడియారం మూడు గంటలు కొట్టింది.

'సరిగ్గా గంట పట్టింది' అనుకున్నాడు. తరవాత నిద్ర పోవటానికి ప్రయత్నించాడు. నిద్ర రాలేదు. సాహస కృత్యం చేశానన్న భావం ఆయన హృదయంలో నిండింది.

కోదండరామయ్య కిటికీ దగ్గరి నుంచి మెల్లిగా "శీనూ" అన్నాడు. జవాబు లేదు. రెండు మూడు సార్లు పిలిచి, లాభం లేదని మంచం మీద కూలబడ్డాడు. కాసేపటికి ఆయన లోని వీరభద్రుడు కిందికి దిగాడు. ఆయనని ఒక్కసారిగా నిస్సత్తువ ఆవహించింది. పిక్క మండ సాగింది. ఒళ్లంతా నెప్పులతో ఎంతో అలసట అనిపించింది. వెంటనే ఆయనకి నిద్ర పట్టేసింది.

* * *

మర్నాడు భోజనాల దగ్గర "మరి కొంచెం కూర వేసుకోండి" అంది కోదండరామయ్య భార్య.

"వద్దు. ఇది చాలు" అన్నాడాయన "అన్నట్టు అరటికాయలు ఎలా కొన్నావు" అన్నాడు.

"ఏం" అం దావిడ.

"అబ్బే, ఊరికే అడిగాను. కాయ లంత బాగులేవు. బాగా లేతగా ఉన్నాయి" అన్నా డాయన.

"నే నని కొనలేదు. ధనుంజయరావు గారి గెల రాత్రెవరో కుర్రాళ్లు కొట్టేశారుట. కాయలు బయట పారేయటం ఎందుకని ముక్కలు తరిగి గిన్నెడు ముక్కలు ఆయన భార్య పంపింది" అంది ఆవిడ.

కోదండరామయ్యకి కళ్ల ముందు రాత్రి తన సాహసకృత్యం మెదిలింది— ఆయన మెల్లిగా "కూర బాగానే ఉంది. మరికొంచెం వెయ్యి" అన్నాడు. *